క్లుప్తంగా...

ఉప్పల్‌లో శ్రీ స్పోర్ట్స్ క్లబ్ ప్రారంభం



ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో ఏర్పాటు చేసిన శ్రీ స్పోర్ట్స్ క్లబ్‌ను ఆదివారం మల్కాజిగిరి డీసీపీ నరేష్ రెడ్డి, ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్ తెలంగాణ అధ్యక్షుడు ఉప్పల్ శ్రీనివాస గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు స్పోర్ట్స్ ఎంతో ముఖ్యమన్నారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఆటలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సంతోష్‌కుమార్, తన్మాయానంద్, ప్రదీప్ గౌడ్, సంపీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



బోడుప్పల్: డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ అన్నారు. శివపురి కాలనీ ఫేస్ 4లో నిర్మించిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి ఆదివారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాలనీవాసులందరూ సమష్టిగా కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవీందర్‌నాయక్, కాలనీవాసులు సాంబశివరావు, ఎస్‌ఎం భాష, ఎం రమేష్, మహేష్, నర్సింహాచారి, సాయి రోహిణి కుమార్, తులసిరావు, అరవింద, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



మేడిపల్లి: పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో ఆదివారం యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి పాటల పుస్తకాన్ని రాచకొండ డీసీపీ గిరిధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాత కందుకూరి శ్యాంసుందర్ రెడ్డి పుస్తక ముద్రణకు సహకరించడం అభినందనీయమన్నారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి పాటల పుస్తక రచయిత జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత అనుముల ప్రభాకరా చారిని, నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో వెంకటేశం, వెదిరె వెంకట నర్సిహా రెడ్డి,రమేష్ గుప్త,శ్రీనివాస్ రెడ్డి,దీప్తి, తాడోజు జగన్నాద చారి, స్వరూప రాణి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రామంతాపూర్ : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మధురా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో శ్రీనగర్ కాలనీలోని గ్రామర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మధుర ట్రస్ట్ తరఫున ఎంతో మంది పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని, వేల సంఖ్యలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలతో పేద మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మల్లేష్, రాజు, వెంకటేశ్వర్‌రావు, వసుంధర, రఫీక్, శ్రీనివాస్ యాదవ్, సంతోష తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మల్లాపూర్: నాచారం డివిజన్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు ఆదివారం ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎక్కడ ఎప్పుడైనా సహాయం కావాలన్నా తాను ముందుంటానని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకులు సాయి జెనోఖర్, మల్లేష్ యాదవ్, భూపాల్‌రెడ్డి, అంజి, కర్ణ,అశోక్, కట్ట బుచ్చన్న, సుగుణాకర్ రావు, పార్టీలో చేరిన వారిలో సాయికిరణ్, సందీప్, శ్రీరామ్, ప్రశాంత్, రవికుఆమర్, కిరణ్ కుమార్ హనుమంత్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే స్వచ్ఛ తెలంగాణ



శ్రమదానంలో పాల్గొన్న మంత్రి మల్లా రెడ్డి, మేయర్ జక్కా వెంకట్ రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న మంత్రి మల్లా రెడ్డి

మేడిపల్లి: సమష్టి కృషితోనే స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ భారత్ సాధ్యమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా స్వచ్ఛత లీగ్ 2.0 ర్యాలీని మంత్రి ప్రారంభించారు. అనంతరం శ్రమదానం చేశారు. తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భగా తెలంగాణ తల్లి విగ్రహం, అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లి పెద్దచెర్వు వద్ద రహదారులను శుభ్రం చేశారు. హరితహారం లో భాగంగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ వందశాతం చెత్త నిర్వాహణతో పీర్జాదిగూడ ముందు వరుసలో ఉందన్నారు. మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ సాధనకు ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ గ్రంధాలయ చైర్మన్ దర్గ దయాకర్ రెడ్డి, కార్పొరేటర్లు, బొడిగె స్వాతి కృష్ణాగౌడ్, కుర్రశాలిని శ్రీకాంత్ గౌడ్, అలవాల సరిత దేవేందర్ గౌడ్,శుభాష్ నాయక్, బచ్చరాజు, మద్ది యుగేందర్ రెడ్డి,అమర్ సింగ్,కొడె పోచయ్య, భీంరెడ్డి నవీన్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, అనంత రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, నాయకులు బండి సతీష్ గౌడ్,పెంటయ్య, జావీద్‌ఖాన్, రఘువర్ధన్ రెడ్డి, ప్రభు, మల్లం వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ పరిధి సాయిఐశ్వర్య కాలనీలో ఆదివారం ఎల్‌ఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేటర్ బైటింటి శారదా ఈశ్వర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కాప్రాలో..

కాప్రా: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి గణనాథులను కాప్రా సర్కిల్‌లోని ఆయా డివిజన్ల వార్డు కార్యాలయాల్లో పంపిణీ చేశారు. ఏఎస్‌రావునగర్‌లో స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌రెడ్డి, కాప్రాలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడిని పూజించాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెనోశేఖర్ అన్నారు. నాచారం హెచ్‌ఎంటీనగర్ కమాన్ వద్ద మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి, శ్యామల, యాకస్వామి, వార్డు కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి సదానంద్ తదితరులు పాల్గొన్నారు.



కుషాయిగూడలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



ఏఎస్‌రావునగర్‌లో మట్టి గణనాథులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శిరీషరెడ్డి

విశ్వకర్మల సేవలు ఎనలేనివి

రామంతాపూర్ : విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు సమాజానికి అందిస్తున్న సేవలు ఎనలేనివని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీనివాసపురంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి హాజరైన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వకర్మను స్ఫూర్తిగా తీసుకుని విశ్వకర్మ కులస్తులు వివిధ వృత్తుల్లో అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో యజ్ఞ మహోత్సవ ఆహ్వాన సంఘం కన్వీనర్లు అకోజు ఆంజనేయ చారి, నాగారం శ్రీనివాస్‌చారి, బైరోజు రామస్వామి చారి, జనగామ శ్రీనివాస్ చారి, వనపర్తి గోపిచార్యులతో పాటు కోర్ కమిటీ సభ్యులు చింతోజు శ్రీనివాస్‌చారి, శిల్పి శశిధర్, మారోజు సోమయ్యచారి, వేల్పు కొండ వెంకటేశా చారి, తునికోజు ప్రభాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి..

అల్వాల్: అల్వాల్‌లో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.అనంతరం విశ్వకర్మ విశ్వజ్ఞ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు స్వర్ణకారులకు ఘనంగా సన్మానించారు.

పీర్జాదిగూడలో..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బుద్దానగర్ లో విశ్వకర్మ, విశ్వబ్రహ్మ జయంతి వేడుకలను జిల్లా విశ్వకర్మ,విశ్వబ్రహ్మ సంఘం అధ్యక్షులు అన్నోజు కృష్ణా చారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లా రెడ్డి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధన చారి, దర్గ దయాకర్ రెడ్డి, వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, నగర మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మంత్రి మల్లా రెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మ, విశ్వబ్రహ్మణుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే తదితరులు

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



మందులు పంపిణీ చేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని బీఆర్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఏఎస్‌రావునగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహపురి ఆధ్వర్యంలో ఆదివారం కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, లయన్స్ డిస్ట్రిక్ 320-సి గవర్నర్ కట్టంగూర్ హరీష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీలంరెడ్డి, మహేష్, మందా సురేష్‌కుమార్, విజయ్‌కుమార్, వరప్రసాద్, చందన్‌రాజు, శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, మనోజ్‌కుమార్, రవికుమార్, గణేష్, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పుట్టినరోజు సందర్భంగా ఉచిత వైద్య శిబిరం



నేరేడ్‌మెట్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మురళీధర్‌రావు



యాప్రాల్‌లో మందులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు

అల్వాల్: ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా బీజేపీ నేత గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నేరేడ్‌మెట్‌లో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 25 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు గోపు రమణారెడ్డి తెలిపారు. గోపు రమణారెడ్డి సేవలు అభినందనీయమని మురళీధర్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌కే. శ్రీనివాస్, జీకే. హన్మంతరావు, నాగరాజు, సుదర్శని, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం యాప్రాల్‌లోని లక్ష్మీనర్సింహ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సత్యనారాయణబాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిచారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు హాజరయ్యారు.

అభివృద్ధి చేస్తా ఆశీర్వదించండి



తిరుమలనగర్ సమావేశంలో పాల్గొన్న బీఎల్‌ఆర్..

కుషాయిగూడ: తనను ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇండస్ట్రీయల్ జోన్‌లో ఉన్న హెచ్‌బీకాలనీ, తిరుమలనగర్ ఎక్స్‌టెన్షన్ కాలనీని రెసిడెన్షియల్ జోన్‌లోకి మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ఆదివారం కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా ఇండస్ట్రియల్ జోన్ కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపడం హర్షనీయమన్నారు. గత 20 ఏళ్లుగా ప్రజాసేవ చేస్తూ ఉప్పల్ ప్రజలకు అందుబాటులో ఉన్నానన్నారు. తనవంతుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించి ఉప్పల్ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. అనంతరం కాలనీవాసులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, భాగ్యమ్మ, ఫర్వీన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా తెలంగాణ

కుషాయిగూడ: అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని బండారి లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన హెచ్‌బీకాలనీ తిరుమలనగర్‌లో జాతీయజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజన్, కార్యదీక్షతోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుమ్మడి జంపాల్‌రెడ్డి, పూస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ హెల్త్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి



మల్కాజిగిరి: ప్రభుత్వం నిర్వహిస్తున్న మొబైల్ హెల్త్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆదివారం ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్ ప్రతి ఆరు నెలలకొకసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. బస్తీ దవాఖానాలు, మొబైల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా సందీప్‌యాదవ్



కుషాయిగూడ: భాగ్యనగర్ గణేష్ ఉత్సవసమితి మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కన్వీనర్‌గా భజరంగ్‌దళ్ నేత సందీప్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి రావినూతల శశిధర్, అసెంబ్లీ కన్వీనర్ రెవెల్లి రాజు, అసెంబ్లీ కో కన్వీనర్ చల్ల ప్రభాకర్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించి హిందు సనాతన ధర్మం కోసం కృషి చేస్తానన్నారు.

విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి



విశ్వకర్మ మహాయజ్ఞానికి హాజరైన మధుసూదనా చారి తదితరులు



హెచ్‌బీకాలనీలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవంలో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి..



హెచ్‌బీకాలనీలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవంలో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి..

ఉప్పల్: విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మాజీ శాసన సభాపతి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లోని విశ్వకర్మలకు కేటాయించిన స్థలంలో నిర్వహించిన భగవాన్ విశ్వకర్మ మహాయజ్ఞ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు మాట్లాడుతూ దాసోజు శ్రావణ్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి గవర్నర్ క్లియరెన్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జూలూరి గౌరీశంకర్, బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర, దాసోజు శ్రవణ్ , ట్రస్టు చైర్మన్ లాలకోట వెంకటచారి, బలవంత చారి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మల అభ్యున్నతికి తోడ్పాటు

కుషాయిగూడ: విశ్వకర్మల అభ్యున్నతికి తనవంతుగా తోడ్పాటునందిస్తానని బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీ, ఫస్ట్‌ఫేస్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీ విరాట్ విశ్వకర్మ 17వ యజ్ఞ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎల్‌ఆర్ మాట్లాడుతూ విశ్వకర్మ భవనానికి అవసరమైన స్థలాన్ని ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వకర్మ ట్రస్టు ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, విశ్వబ్రాహ్మణసంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు బిక్షపతిచారి, ప్రదాన కార్యదర్శి అనంతచారి,బ్రహ్మాచారి, మహిళ అధ్యక్షురాలు నాగారం కవిత, కాప్రా సర్కిల్ సంఘం చైర్మన్ కేశోజు లక్ష్మీ నారాయణ, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసాచారి, యజ్ఞ కమిటి అధ్యక్షుడు పాములపర్తి వెంకటాద్రి, ప్రదాన కార్యదర్శి శ్యాంసుందర్‌ఆవు, సద్గుణాచారి, సమ్మని మురళీచారి, సిద్దుచారి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఎల్లారెడ్డిగూడ వాసులు



కాప్రా: అక్రమ నిర్మాణాలు, అధికారుల అలసత్వం, స్థానిక సమస్యలపై కదం తొక్కారు కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడ వాసులు. రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు, విద్యుత్ స్తంభాల సమస్యలపై ఆదివారం ఆందోళనకు దిగారు. దాబాగార్డెన్ నుంచి ఎల్లారెడ్డిగూడ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మరో వైపు దాబాగార్డెన్ వద్ద నాలాపై నూతనంగా కల్వర్టు నిర్మించిన అధికారులు అక్కడున్న విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సమస్యలను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

లోటస్ ల్యాప్‌లో వినాయకచవితి సంబురాలు

బోడుప్పల్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం వినాయక చవితి సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి భారతీయుల అతి ముఖ్యమైన పండుగల్లో ఒకటన్నారు. చిన్న పిల్లలు గణపతి వేషధారణలో పాల్గొన్నారు. వారు తయారు చేసిన గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పటేల్ కృషితోనే తెలంగాణ విలీనం

రామంతాపూర్ : సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ కృషితోనే భారత యూనియన్‌లో తెలంగాణ విలీనమైందని మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ అన్నారు. ఆదివారం విమోచన దినం సందర్భంగా ప్రధాన రహదారిలోని సర్దార్ పటేల్ విగ్రహానికి బీజేపీ కార్పొరేటర్ కక్కిరేణి చేతన, హరీష్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు మనిషి సర్దార్ పటేల్ ధైర్యం చొరవతో నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తమై స్వేచ్ఛా వాయువులు పీల్చుకుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు హరీష్, సంజయ్ పటేల్, సోమశేఖర్ , ఎల్లాచారి, ప్రవీణ్, గడ్డం సాయి కిరణ్, రవీందర్‌రెడ్డి, వెంకన్న, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



ఉప్పల్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



బోడుప్పల్: స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇద్దామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా ఆదివారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు, పరిశుభ్రత, స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి పౌరుడు వారానికి రెండు గంటలైనా పరిసరాల పరిశుభ్రతకు సమయం కేటాయించాలన్నారు. ఆరు బయట చెత్త వేయమని, ఇతరులు వేయకుండా చూస్తామని, మేం నివసించే వీధి, కాలనీ, వార్డు, పట్టణంను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రజలచే ప్రమాణం చేయించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా వద్ద చెత్తను ఊడ్చగా, కేశవనగర్ వద్ద కాలనీ అధ్యక్షులు నరేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున్ పాల్గొని చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కమిషనర్ జి. వేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా, కొత్త చందర్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.